# ముడుపు కట్టిన కవిత్వం

(కథానిక)

"ఇంత గొప్ప ఉద్యోగం చేసిన నాకు గౌరవమే లేక పోయిందే! ఎవడు చూసినా ఆనవానందస్వామి వైపు చూడడమే ఆ సభలో! ఆయన ఉపన్యాసకుడట, మహాకవిగారట. పక్కని నేనున్నానన్న ఆలోచనే లేదు ఒక్కడికీ! ఎంత చిత్రం! ఎంత దర్జాగా బతికేను, ఏమిటికథ! మొన్న మొన్నటి దాకా నెలకి వెయ్యిరూపాయిల జీతం తెచ్చుకున్నాను. ఇప్పుడు పించినీ దానిలో సగం. ఎంతేసి పెద్ద జీతగాళ్లు నాచుట్టూ తిరిగేవారు! అంతా అరటిచెట్టు గెల వేసినట్టయిపోయిందా బతుకు? ఇందుకే మనవాళ్లు సప్తసంతానాలలోను ఉద్యోగాన్ని చేర్చకపోడం! ఇప్పుడైతే మట్టుకు యేమి కొంపమునిగిపోయింది. కావ్యకన్యకలను ఊరికే సృష్టించిపారేస్తాను. ఎందుకు ఈపూటే మొదలెడతాను. లెక్కల ఎమ్. ఏ. పాసయిన నాకు ఇదొక లెక్కా? కవిత్వపు ముక్కలు అంటక పోతాయా ఎక్కడేనా! 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని లోకోక్తి. కృషిచేస్తే అది సాధ్యం కాదండీ! సాధనమున పనులు సమకూరు ధరలోన అని చిన్నప్పుడు చదువుకొన్న వేమనగారి ముక్కలు! అప్పుడే కొంచెం కవిత్వపుధోరణి మొదలు పెట్టినట్లుగా ఉంది. దీనిని ఆలాగలాగు పెంచేస్తాను" అని వింజామరంగారు కులికేడు.

ఆయన ఉపమాశాస్త్రులుకి కబురు పంపించేడు. శాస్త్రులుకి ఆ పేరు శిష్యులిచ్చిన బిరుదు. ఆయన ఉపమాలంకారప్రియుడు కాబట్టి ఆ బిరుదు వచ్చిందని కొందరంటారు. కాదు కాదు ఉప్మా అంటే చెవికోసుకుంటాడు కాబట్టి ఆ బిరుదు వచ్చిందని మరికొందరంటారు. ఏదైనా ఈ బిరుదు వచ్చేక ఆయన అసలుపేరు పోనే పోయింది.

వింజామరంగారు ఉపమాశాస్త్రులుకి ఉప్మా కాఫీ ఇచ్చి మర్యాద చేశాడు. శాస్త్రులు పుచ్చుకొన్నాడు. చూపుడువేలు పక్కలకి ఊపుతూ కవిత్వోపన్యాసం మొదలుపెట్టేడు. "అయ్యా! ఏమి కవులండి! ఏమి కవులండి! వారి శృంగార రచన లేమి రచనలండి! ఏమి రచనలండి! కవిత్వానికి పర్యాయపదం శృంగారమనే చెప్పవచ్చు. కీచక ద్రౌపదుల ఘట్టం సృష్టించిన తిక్కనగారు ఎంత విలాసంగా తిరిగేవాడో కదా! ఆయన రూపం నా మనోనేత్రంముందు సంచరిస్తూంది. సొంపైన్ని గంధపురేఖలు, కస్తూరి తిలకం, కుందనపు కుండలాలు, నోటినిండా తాంబూలం, మళ్ళీ చేతిలో విడెము, గాలికి యెగిరిపోతుంటే పల్చని ఉత్తరీయాన్ని పట్టుకొన్న రెండో చేయి, ఆవిలాసమూర్తిరూపం! క్రీడాభిరామ కర్తయైన శ్రీనాధుడు స్త్రీలోక మన్మధుడే కదా! శృంగార కావ్య పంక్తిలో శిఖరాలని చెప్పదగిన తారాశశాంకం, చంద్రరేఖా విలాపం కేవలం సూచికాభేద్యము లేని రత్నములు. అంత ఎందుకు! ఈనాటి తిరపతి వెంకటకవుల శ్రవణానందం చూడండి. అది నిజముగా సకల శరీరానందమే! దానిని తలుచుకొంటే ఒళ్లు పులకరిస్తూంది. ఇవన్నీ చెప్పేక పాత చింతకాయ పచ్చడి కవుల మాట తల పెట్టకూడదు. వాల్మీకి, వ్యాసుడు ఋషులట! కవిత్వానికి ఋషికీ సంబంధమేమిటి! చెంచెతకు, నవనాగరిక విలాసినికి పోలిక ఏమిటి! కాళిదాసుగారి శాకుంతలంలోని శృంగార ఘట్టం తీసివేస్తే మిగిలేదంతా పిప్పే! అలాగే మనుచరిత్రలో వరూధినీ ప్రవరుల ఘట్టం లాగి పారవేస్తే మిగిలినది వట్టి డొలక! భవభూతి ఎటువంటి అవకాశాన్ని నిష్కారణంగా జారవిడిచేడో చూడండి. సీతారాములను ఒక్కచోట చేర్చినప్పుడు పచ్చిశృంగారం కురిపించెయ్య వద్దుటండీ!" ఉపమాశాస్త్రులు ఈ ధోరణిలో మొదలుపెట్టి మధ్యమధ్య శ్లోకాలను, పద్యాలను, లోకోక్తులను పొదిగించి

టేకుమళ్ల కామేశ్వరరావు

వింజామరంగారని ఊరించి చక్కా లేచి పోయేడు.

వింజామరంగారు తాను చిన్నప్పుడే కవిత్వం నేర్చుకొనుంటే ఈపాటికి మహాకవి షష్ఠిపూర్తి సన్మానంకోసం ఎదురు చూస్తుండేవాడినని, అదీ కాకపోతే కాలిని గండపెండేరం ధరించి చాతీ విరుచుకొని తిరిగేవాణ్ణని తల పోశాడు.

ఉపమాశాస్త్రిలు సాయంచెయ్యగా వింజామరంగారు లక్షణం ముక్కలు రెండు నేర్చుకొన్నాడు. కవిత్వంలో తప్పటడుగులు వేస్తున్నాడు. "పూజశృంగారంబడె కవి భోజనంబు" అని మకుటంపెట్టి రాసిన పద్యాలను శాస్త్రిలూ తానూ కూర్చుని ఆనందించేరు.

వింజామరంగారు సొంతంగా కోకిలపాట విని పద్యాలు రాద్దామనుకొన్నాడు. వేషం వేసుకొని ఊరిబయటికి బయలుదేరేడు. కోకిల కూత విని ముళ్ళ డొంకలు, తుప్పలలోంచి నడక సాగించేడు. కాళ్ళలో ముళ్ళు విరిగేయి. శ్రమపడి ఎట్టకేలకు అంటుమామిడి చెట్టుదగ్గరకి చేరుకొన్నాడు. అంతవరకూ కూస్తున్న కోయిల ముక్కు బిగించి వేసింది. వింజామరంగారికి చెప్పలేనంత ఆశాభంగమయింది. మనస్సు చిన్నబోయింది. విచారిస్తూ ఇంటిమార్గం పట్టేడు.

ఆయన ఇంటికిచేరి వాలు కుర్చీమీద విశ్రమించి "ఇంతకీ రచన అంటే పద్యమే కానక్కరలేదు. పైగా ఇది వచనయుగం! అనేకమంది కథకులు చిన్నలు పెద్దలు, స్త్రీలుకూడా పేరు సంపాదించేరు. కొందరుమహానుభావులుశృంగార కథలను, పచ్చిశృంగార కథలనుకూడ రాసి పేరు సంపాదించేరు. కాబట్టి మనంకూడ కథారచనలో సిద్ధహస్తులమవుదాం" అని ఆలోచించేడు.

వింజామరంగారు ఏ విషయంలోను కూడ పూర్వపు మనిషిలాగులేడు. మొహానికి తేజస్సు వచ్చింది. నవ్వులలో భావాలు బయలుదేరేయి. రెప్పలు అల్లారుస్తూ, మొహం ఆడిస్తూ, బొర కదుపుతూ, కులుకుతూ మాట్లాడేవాడు. వీటికి తోడు జుట్టు పెంచివేశాడు, అవి పండువెంట్రుకలైనా గమనించకుండా! పలిపెములలాంటి గుడ్డలుధరించి, అత్తరువు ఘుము ఘుము లాడుతూండగా షికారులు బయలుదేరేవాడు. రచనలకి సామగ్రి అవసరమని సినీమాలకి, నాటకాలకి, నాట్యాలకి వెళ్ళేవాడు. జారుల వ్యవహారాలు ప్రత్యక్షంగా పరిశీలించాలని నిశాచరత్వం మొదలుపెట్టేడు.

కొత్తగాపుట్టిన కవిత్వపు కుదుపు తాకిడి కొంత ముసలి ఇల్లాలికి తగలడం మొదలు పెట్టింది. ఆవిడ ముసిముసినవ్వులు నవ్వుకొని, ఈయనకేమైనా మతిపోయిందా, భూతం ఆవేశించిందా అని విస్తుపోయింది. రవ్వంత బుద్ధి చెప్పుదామని దగ్గరికి వెళ్ళగా వింజామరంగారు పట్టికబుర్లు సాగనిచ్చేవాడు కాదు.

ఈ కొత్త సందడిలోపడ్డాక ఆయన దేవతార్చనను విసర్జించేడు, భగవద్గీతకు స్వస్తిచెప్పేడు. ప్రతినెలా కడుతూండే భీమాకి డబ్బు కట్టడం మరచిపోగా అది నాశనమైపోయింది కాని కవిత్వపు కైపులో ఆయన దానిని గమనించనే లేదు.

వింజామరంగారు కథ ఒకటి శ్రమపడి రాసి వారపత్రికలో అచ్చువేశాడు. అంతటితో ఊరుకోక దాని ప్రతిఒకటి తెచ్చి పక్క ఇంటిలోకి కిటికీగుండా పడవేయించేడు.

వింజామరంగారి పక్క ఇంటిలో శివాచారి ఉంటున్నాడు. అది అతని సొంత ఇల్లే. పక్క పక్క ఇళ్ళలో ఉండబట్టి వింజామరంగారికీ శివాచారికీ ఏవో చిల్లరమనస్పర్థలు—పెరళ్ళలో చెట్లమీంచి ఎగిరివచ్చే ఎండుటాకులను గురించి ఇంటిముందు పుల్లాకులనుగురించి, మధ్యనుండే గోడనుగురించి మొదలైనవి బయలుదేరేయి. అవి పెరిగి వాదనలుగా పరిణమించేయి.

శివాచారి పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. ఆరుగురు సంతానం. మనిషిలో కొన్ని మంచి గుణాలు లేకపోలేదు. కాని తగువులాట వస్తే మట్టుకు ముందువెనుకలు చూడడు

వింజామరంగారు మారుపేరు పెట్టి శివాచారి అంతరంగ జీవితమంతా లోపభూయిష్ఠమనీ, నీతిబాహ్యుడనీ తాను అచ్చువేసిన కథలో రాశాడు. శివాచారి ఆకథనిచదివి అదితనమీదేఅని తెలుసుకొని నిప్పులు తొక్కిన కోతిలాగు గంతులువేసి, మాననష్టం దావా పడవేశాడు.

వింజామరంగారు సబ్‌కోర్టు వెంట తిరిగి గుండపిండి అవుతున్నాడు. ఇంటిదగ్గిర కావ్య రచన హైరానాకి తట్టుకోలేకపోతూంది ఆయన శరీరం!

ఆయన భార్య ఆయనతో, శివాచారితో లేనిపోని తంటా ఎందుకు తెచ్చిపెట్టుకొన్నారనీ, ఈ పుస్తకాల గోల మన కెందుకనీ కేకలువేసింది కాని ఆయన పెడచెవిని పెట్టేడు.

వింజామరంగారి ఆరోగ్యం మునపటిలాగు లేదు. మనిషి రోజురోజుకీ నీరసించిపోతున్నాడు. పొగాకు కాడలాగు తయారయేడు. ఆయనను చూసి భార్య దిగులుపడింది.

మానసనష్టం దావాలో శివాచారి గెలిచాడు. వింజామరంగారు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు ఇచ్చుకోవలసి వచ్చింది. ఆయన అన్నివిధాలా నష్టపోయినట్లు భావించేడు.

ఒకే వ్యాసంగంకలవాళ్లవడంచేత వింజామరంగారికీ నవానందస్వామికీ కొంచెం పరిచయమేర్పడింది. దారిని పోతూన్న నవానంద స్వామిని వింజామరంగారు పిలిచేడు. స్వామి వచ్చి పేము కుర్చీమీద కూర్చున్నాడు. స్వామి అంటే వింజామరంగారికి నిజమైన గౌరవం లేదు.

"క్షేమంగా ఉంటున్నారా?" అని స్వామి కుశలప్రశ్న వేశాడు, గడ్డం నిముకుంటూ.

"అదే క్షేమం!" అని బుర్ర నిలువుగా ఆడించేడు వింజామరంగారు.

"ఏమండీ అట్లాగంటున్నారు?" అని ఆశ్చర్యపడ్డాడు స్వామి.

"ఒంటిలో అంతగా బాగుండడం లేదు మరి!"

స్వామి విచారించేడు.

"ఇప్పుడేమన్నా రాస్తున్నారా?" అని భోగట్టాచేశాడు స్వామి

"రాయకుండా కూర్చుంటే ఏలాగ అవుతుంది మనబోటివాళ్లకి!" ఆదరిపడ్డ వాడిలాగు సమాధాన మిచ్చేడు వింజామరంగారు.

"ఏమిటి రాస్తున్నారు?"

"కథ ఒకటి మొదలు పెట్టేను"

"థీమ్?"

"సాంఘికం"

"రసం?"

"శృంగారమే! దానికంటే మించిన రసమేముందండి!" అన్నాడు వింజామరంగారు.

"శృంగారం పేరట పచ్చి శృంగారరచనలు కూడ బయలుదేరుతున్నాయిలెండి!" అన్నాడు స్వామి సూటిగా విమర్శించకుండా.

"శృంగారంలో కొందరు కొన్నిటిని మరుగుపరుస్తారు. మరికొందరు వాటిని బైటపెడతారు. అది కొందరికానందమిస్తే, ఇది మరికొందరికి ఆనందమిస్తుంది. ఇంతకీ చెప్పినా చెప్పకపోయినా ప్రకృతి ప్రకృతే!" అన్నాడు వింజామరంగారు.

"శృంగారానికి నీతికి ముడిపెట్టి ఉంది" అన్నాడు స్వామి.

"నీతి ప్రమాణం మనిషి మనిషికి, తరం తరానికి, సంఘం సంఘానికి, దేశం దేశానికి కూడ మారుతూంటుంది. దానికొక ప్రమాణమెక్కడ స్వామీ!"

"మళ్ళీ నీతికి భగవంతుడికి లంకె ఉంది" అన్నాడు నవానంద స్వామి.

"అదంతా వ్యక్తుల భిన్నభిన్న అభిప్రాయాలు లెండి!" అని ఒక్కముక్కలో తుంచివేశాడు వింజామరంగారు.

"ఇంతకీ కథారచనకి అనేకరసాలున్నాయి. నవరసాలలో శృంగారరస మొకటిమాత్రమే! మనం భోంచేసే ఆహారంలో ఆరురుచులున్నాయి. వాట్లో తీపి ఒకరుచి. శృంగారమొక్కటే రసమనడం తీపి ఒక్కటే రుచి అనడం వంటిది. తీపి ఒక్కటే తిని మనం బతికుండగలమా? అదే మోస్తరుగా కావ్యకళలో అన్నిరసాలకూ సమాన ఆదరణ ఇయ్యాలి" అన్నాడు స్వామి.

స్వామి చెప్పినది వింజామరంగారికి యెంత మాత్రమూ నచ్చలేదు. "ఎవరిరుచి వారిది, ఎవరి బుద్ధి వారిది! మొత్తంమీద అందరం భాషా సేవకులమే లెండి!" అన్నాడు.

"భాషాసేవకుడు అనే పదం విద్యాధికారి లాంటిది. ఇంతకీ మీరు వయోవృద్ధులు! మీకు ఒకరు చెప్పవలసిం దేముంది. మీరు వినవలసిం దేముంది!" అని చల్లగా సెలవు పుచ్చుకున్నాడు స్వామి.

వింజామరం గారికి నలత క్రమక్రమంగా ముదిరింది. మంచాన్ని పట్టేడు భార్య ఎంతో విచారించింది వైద్యుడు చికిత్స చేస్తున్నాడు. కాని గుణమియ్యలేదు.

ఆయన భార్య "ఈ రోగమంతా మీకు కవిత్వమే తెచ్చిపెట్టింది. ముసలితనంలో మీ కెందుకు పుట్టిందో ఈ పోయికాలం-పోయిగా కాలుమీద కాలు వేసుకు కూర్చుని రామాకృష్ణ అనుకోక ఎందుకు వచ్చినపని ఇది! ఇప్పటికైనా కాస్తబుద్ధి తెచ్చుకోండి!" అంది.

ఒకవేళ ఆమె చెప్పినమాటే నిజమేమో అని "అయితే నన్నేమి చెయ్యమన్నావే?" అని అడిగేడు.

"ఏమిటి చెయ్యమన్నా నేమిటి! తిరుపతి వెంకటేశ్వరుడికి మొక్కుకోండి. ఈ రోగం నిమ్మళిస్తే నీ కొండకి వచ్చి దర్శనం చేసుకొంటానని" అంది.

ఏలాగో ఒకలాగు బతికుంటే చాలునని వింజామరంగారు కవిత్వాన్ని తిరుపతి వెంకటేశ్వరుడికి ముడుపుకట్టేడు.

---

స్కెచ్

# పెద్దవాళ్ల పరువు

ఇచ్ఛాపురపు జగన్నాధరావు

బట్టలు వేసుకుని ఆఫీసుకి వెళ్లబోతూ, డ్రాయర్ లోంచి పదిరూపాయిలనోటు తీసుకోడం మాట జ్ఞాపకంవచ్చి ప్రకాశరావు ఒకసారి వెనుదిరిగ్గాడు, తొందరగా తాళంతీసి వెదికాడు- అతనెక్కడ దాన్ని పెట్టాననుకున్నాడో అదక్కడలేదు. పుస్తకాలన్నీ తీసి వెదికాడు. లేదు. పర్సు చూసుకున్నాడు. ఒక ఐదు రూపాయిల నోటుమాత్రం ఉంది. పది రూపాయిల నోటు ఏమైంది?

వెతకడంమానేసి నిటారుగానిలబడి ఎక్కడ దాన్ని పెట్టాడోఆలోచించుకున్నాడుతాపీగా. నిన్న మధ్యాహ్నం అక్కడ ఉండి రాసుకుంటూంటే ఇంటద్దె ఇచ్చిరమ్మని భార్యతో చెప్పాడు. పదిరూపాయిల నోటు ఇచ్చాడు. ఇంటివాళ్లెక్కడికో వెళ్ళారని మళ్ళా ఆమె ఆ నోటు తెచ్చి ఇస్తే డ్రాయర్లో నీలం పుస్తకంలో దాన్ని పెట్టాడు. ముమ్మాటికీ అది అక్కడ ఉండితీరాలి!

మళ్ళా వెదికాడు, కనబడలేదు. అతనికి చిరాకు వేసింది. ఏమైనట్టు?

"పార్వతీ!" అని గట్టిగా పిల్చాడు. ఆఫీసుకి టైమ్ అవుతోంది.

ఆమె వచ్చింది. "పదిరూపాయిలు నువ్వుగాని తీశావా?" అన్నాడు.

"లేదే! అందులో లేదూ?" అంది ఆశ్చర్యంగా పార్వతి.

"లేదు... ఏమైనట్టు?" ప్రశ్నార్థకముఖం.

"ఏమైందంటారు? జాగ్రత్తగా చూశారా?"

"కావలసినంత జాగ్రత్త. నువ్వో సారి చూడు. ఇవాళ ఇన్స్యూరెన్స్ ప్రీమియం కడదామని అనుకున్నా. నువ్వో వెదుకు"

ప్రకాశరావు చిరాకుగా ఆఫీసుకు వెళ్లిపోయాడు, డబ్బంటే అతను చాలా చులాగ్గా చూడడు. పదిరూపాయిలు! ఏమైనాయో!

సాయంత్రం ఇంటికి వెళ్ళగానే మళ్ళా ఆ నోటు ప్రస్తావన తెస్తూ, "దొరికిందా పార్వతీ?" అన్నాడు.

"లేదండీ!"

"వెదికావా బాగా?"

"జాగ్రత్తగా వెదికాను"

"అయితే ఏమైందంటావ్? ముగ్గురిలోనూ ఎవళ్ళో ఒకళ్లు తియ్యాలిగా? నేను తియ్యలేదు- నువ్వు తియ్యలేదు. ఇంక సత్యం తీసి ఉండాలి; దొంగ లెత్తుకెళ్ళి ఉండాలి"

"ఆశ్చర్యంగా నేఉందండీ! నిన్న మధ్యాహ్నం పెట్టిన నోటు ఈ వేళకెలా మాయంఅయిందో! సత్యం ఎందుకుతీస్తాడు? ఎప్పుడైనా అలా తీశాడుగనకనా?"

"ఏమో! ఎవరుచూడొచ్చారు? వాణ్ణి అడుగుతా—దయ్యాలేం లేవుగా ఇంట్లో? దొంగ అయితే ఎక్కడో పుస్తకంలో ఉంచిన ఈనోటు కోసం ప్రత్యేకంగా రాడు!"